క్లుప్తంగా

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎన్ని ఇచ్చారు?

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



చాపగానీతండాలో మహిళలతో మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక సమస్యలపై పాలకులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాపగానీతండా గ్రామంలో మంగళవారం పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న...గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమ చేపట్టి ఇంటింటికి తిరిగారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తే వాటిని అగ్గిపెట్టెల్లా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారని, ప్రస్తుత బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి



వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక: దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దుబ్బాక - లచ్చపేట దారి గుంతలమయంగా మారడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుంతలుపడిన రోడ్డులో పార్టీ నాయకులతో కలిసి వరినాట్లు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల భరత్, శ్రీనివాస్, మల్లేశం, రాములు, మధు పాల్గొన్నారు.

పల్లె పల్లెకు బీసీ చైతన్య యాత్ర

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ నియోజకవర్గంలో బీసీలను చైతన్యపరచడానికి పల్లె పల్లెకు బీసీ చైతన్య యాత్ర చేపట్టినట్లు బీసీ సంక్షేమ సంఘం నాయకుడు పచ్చిమట్ల రవీందర్ తెలిపారు. మంగళవారం పందిల్ల, పొట్లపల్లి గ్రామాల్లో గీత కార్మికులు, యాదవ, పద్మశాలి సంఘాల నాయకులతో మాట్లాడారు. బీసీల ప్రాముఖ్యత గురించి వివరించి వచ్చే శాసన సభ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని ఎన్నికల్లో నిలబెట్టి గెలుపించుకోవాలన్నారు. గతంలో బీసీ ఓట్లతోనే దేశిన చిన మల్లయ్య మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఇప్పుడు కూడా నియోజకవర్గంలో 1,60,000 ఓట్లు ఉన్నాయని, బీసీలు ఐక్యతతో ఉంటే మన అభ్యర్థి శాసనసభ ఎన్నికల్లో విజయం సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రామస్వామి, గొర్ల కొమురయ్య, నమిలికొండ అయిలయ్య, బొమ్మగాని రవీందర్, మాచర్ల శ్రీనివాస్, పూదరి రామస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

హుస్నాబాద్: తెలంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి నెల గడువు పెంచి, రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ డిమాండ్ చేశాడు. పట్టణంలోని అనబేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళలతో పాటు దివ్యాంగులు, తల్లిదండ్రులు లేనివారు, ఒంటరి పురుషులకు పథకానికి అర్హులుగా గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులకు రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పిల్లలకు తల్లిపాలే మేలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందని ఆయుర్వేద వైద్యురాలు దీపాంజలి అన్నారు. మంగళవారం ఇటిక్యాల అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని, వాటిలో రోగనిరోధకశక్తి ఉంటుందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, టీచర్లు కవిత, శ్వేత, ఆయాలు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): చంటి బిడ్డలకు తల్లిపాలు పట్టిస్తే ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీపీ మాలోతు లక్ష్మీ అన్నారు. అక్కన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, సీడీపీఓ జయమ్మ, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ కేంద్రం టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్నాం.. ధరణిలో లేం

పేదలకు ఎనిమిది దశాబ్దాల క్రితం సాగు చేసుకునేందుకు ప్రభుత్వం భూ పంపిణీ చేసింది. అప్పటి నుంచి ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. అయితే పంపిణీ చేసిన భూముల వివరాలు రికార్డుల్లో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది క్రయవిక్రయాలు చేయడంతో సమస్య మరింత జటిలమైంది. ధరణిలో పేర్లు లేకపోవడం, కొత్త పాస్ పుస్తకాలు రాకపోవడంతో వారు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి దుస్థితి ఏర్పడింది.

- గొల్లపల్లి రైతుల ఆవేదన
- భూ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి
- కొత్త పాస్‌పుస్తకాలు రాక ప్రభుత్వ పథకాలకు దూరం



పట్టాదార్ పాస్ పుస్తకాలు చూపుతున్న రైతులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని గొల్లపల్లిలో ఎనిమిది దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామంలో ఎస్సీ, బీసీ కులాలతోపాటు ఇతర పేదలకు 101 సర్వే నంబర్‌లోగల 75 ఎకరాల సాగుభూమిని వంద మంది రైతులకు పంపిణీ చేసింది. అప్పటి నుంచి వాటిని సాగుచేస్తున్నారు. ప్రభుత్వం ప్రొసీడింగ్‌లుఇచ్చి పాస్ పుస్తకాలను ఇచ్చింది. ఆ సమయంలో వారసత్వ భూసమస్య తలెత్తడంతో 2008లో మళ్లీ వారసత్వంగా వచ్చే వారికి ప్రొసీడింగ్‌లు ఇచ్చి పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేసింది. ఆ పుస్తకాలపై బ్యాంకు రుణాలు తీసుకుంటూ పంటలు సాగుచేస్తున్నారు. అలాగే వారసత్వంగా కొంత మంది రైతులు తమ పేర్లను రికార్డులోకి ఎక్కించుకోవడం, చనిపోయిన వారి పేర్లు రికార్డుల నుంచి తొలగించకపోవడంతో రికార్డుల్లో రైతుల సంఖ్య పెరిగింది. కాగా సేత్వార్‌లో 75 ఎకరాలు చూపడం, కొలతలు వేస్తే 95 ఎకరాలకు పైగా చూపడంతో సమస్య తలెత్తిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం 112 మంది సాగులో ఉన్నారు.

లావాదేవీలు జరపడం వల్ల..

101 సర్వే నంబర్‌లో సాగు చేసుకుంటున్న రైతులు భూ విక్రయాలు జరిపారు. అలా జరిపిన రికార్డుల్లో విక్రయదారుల పేర్లను తొలగించకపోవడంతో రైతుల సంఖ్య పెరిగిందని గ్రామస్తులు తెలిపారు. ధరణిలో పాతవారి పేర్లు ఉండటం, ప్రస్తుతం సాగు చేసుకుంటున్న వారి పేర్ల లేకపోవడంతో కొత్త పాస్ పుస్తకాలు ఎవరికీ రాలేదు. దీంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వ పథకాలకు దూరం



మేము 101 సర్వేలోగల భూమిలో సాగు చేస్తున్నాం. ఆ నంబర్‌లో మాకు 20 గుంటల భూమి ఉంది. ఇక్కడ తప్ప వేరే చోట భూమి లేదు. ఇదే మాకు జీవనాధారం. దరణి వచ్చిన తర్వాత కొత్త పాస్‌బుక్‌లు రాలేదు. రైతుబంధు, రైతుబీమాకు దూరమవుతున్నాం.

– వెంకటస్వామి, రైతు, గొల్లపల్లి

అధికారులు స్పందించాలి



మాకున్న ఎకరం 19 గుంటల భూమిలో పంటలు పండిస్తున్నాం. తాత నుంచి సాగు చేస్తున్నాం. పాత పాస్ పుస్తకాలు ఉన్నాయి. కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వలేదు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా 101 సర్వే నంబర్ రికార్డులో తప్పులు ఉన్నాయని చెబుతున్నారు. కలెక్టర్‌కు కూడా చెప్పినం.

– భాగ్యమ్మ, మహిళ రైతు, గొల్లపల్లి

త్వరలో న్యాయం చేస్తాం

గొల్లపల్లిలో 101 సర్వే భూమిలో సాగు చేసుకుంటున్న రైతులకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు రాలేదని, సంబంధిత రైతులు మా దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. ఇటీవల సర్వే చేశాం. రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– రఘువీరారెడ్డి, తహసీల్దార్, జగదేవ్‌పూర్

శభాష్.. సుమన్, చందు

గ్రామస్తుల అభినందన



బద్దం సుమన్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పోతారం (జె) గ్రామపంచాయతీ పరిధి తుర్కవానిపల్లికి చెందిన బద్దం లక్ష్మీ, మల్లారెడ్డి దంపతుల కుమారుడు బద్దం సుమన్‌రెడ్డి సివిల్ ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. ఇతడికి 2018లో కానిస్టేబుల్ ఉద్యోగ వచ్చింది. 2019లో ఆ ఉద్యోగానికి రాజీనామాచేసి హైదరాబాద్‌లో పోటీ పరీక్షలు రాసి ఎస్ఐగా ఎంపికయ్యాడు. ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కొమురవెల్లి(సిద్దిపేట): ఎస్ఐగా ఎంపికైన యువకుడిని గ్రామయువత ఆదర్శంగా తీసుకోవాలని మండలంలోని మర్రిముచ్చాల సర్పంచ్ బోడుగాం పద్మ మంగళవారం అన్నారు. ఇటీవల వెలుపడిన ఎస్ఐ ఫలితాల్లో ఎస్‌పీఎఫ్ విభాగానికి చుంచు చందు ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్తులు, స్థానికులు అతడిని అభినందించారు.



చందును అభినందిస్తున్న సర్పంచ్ పద్మ

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓ నర్సింహారెడ్డి

విద్యాశాఖ అధికారుల సూచన

చేర్యాల(సిద్దిపేట): ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని మండల విద్యాధికారి నర్సింహారెడ్డి సూచించారు. మంగళవారం ముస్త్యాల మోడల్ స్కూల్‌లో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలుగు, ఆంగ్లం, గణితం బోధించే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు.

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యనందించాలని సెక్టోరియల్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ఆరు రోజులుగా తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించినపుడే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రమోషన్‌లు, బదిలీలు షెడ్యూల్‌లు వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమాన్ని హాజరై మాట్లాడారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

హుస్నాబాద్: సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేవారికి తెలంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద చేయూత అందించేందుకు శ్రీకారం చుట్టింది. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తుల స్వీకరణ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ పథకానికి 8 నుంచి 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. కాగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎటువంటి ప్రచారం చేయలేదు. కేవలం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పేరిట గృహలక్ష్మి పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వాట్సప్ గ్రూప్ ద్వారా ప్రకటన విడుదల చేశారు. ఈ పథకంలో ఎంపికైన వారికి విడతల వారీగా రూ.3 లక్షలు ఇవ్వనున్నారు. నియోజకవర్గంలో 3 వేల యూనిట్లు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే దరఖాస్తుకు మూడు రోజులు మాత్రమే గడువు విధించడం సరికాదని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు.

10వ తేదీలోగా..

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గృహలక్ష్మి పథకానికి మంగళవారం సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈనెల 10వ తేదీ సాయత్రం 5 గంటలలోపు అందజేయాలని సూచించారు. దరఖాస్తు పత్రంతో ఆహార భద్రత కార్డు, నివాసం, ఇంటి స్థలం ధ్రువీకరణ పత్రాలు జతచేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



అనిల్‌కుమార్

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు తహసీల్దార్‌గా అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిజామాబాద్ జిల్లా నందిపేట తహసీల్దార్‌గా పనిచేశారు. ఇప్పటి వరకు పనిచేసిన దిలీప్‌నాయక్ సిద్దిపేట అర్బన్‌కు బదిలీపై వెళ్లారు.



అనంతరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల నూతన తహసీల్దార్‌గా మంగళవారం వి.అనంతరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ కొండపాకకు బదిలీపై వెళ్లారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక తహసీల్దార్‌గా చల్లా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో డీఏఓగా పనిచేశారు. నూతన తహసీల్దార్‌కు తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ మల్లమారి రవీందర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన రామేశ్వర్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

ఐకమత్యంగా ఉండాలి

మిరుదొడ్డి(దుబ్బాక): నాయీ బ్రాహ్మణులు ఐకమత్యంగా ఏదైనా సాధించవచ్చని నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు జనగామ సతీష్ అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మంగళవారం మండల స్థాయి నాయీ బ్రాహ్మణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మంగలి సాయిలు, ఉపాధ్యక్షుడిగా బాలరాజు, కార్యదర్శిగా రాచమల్లు వినోద్, ప్రధాన కార్యదర్శిగా రాజలింగం ఎన్నికయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోగల తెలంగాణ మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ గోపి మంగళవారం తెలిపారు. తెలంగాణ మోడల్‌స్కూల్, కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో గణితం బోధించేందుకు ఎమ్మెస్సీ(మ్యాథ్స్), బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి గంటల ప్రాతిపదికన నెలకు రూ. 18,200 పారితోషికం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 11న డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు తెలంగాణ మోడల్‌స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

పీర్ల ఊరేగింపు

గజ్వేల్: మండల పరిధిలోని అక్కారం గ్రామంలో జరిగిన కొత్త పీర్లపండగలో టీఎస్ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. పీర్లకు పూజలు చేశారు. ఊరేగింపులో యువకులను ఉత్సాహపరచడంతో వారు కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాల్‌చంద్రం, జెడ్పీటీసీ మల్లేశం, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఆపలేరు

బెజ్జంకి(సిద్దిపేట): ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ మండల అధ్యక్షుడు రూపేష్ పేర్కొన్నారు. బెజ్జంకిలో వంద పడుకల ఆస్పత్రి, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటుపై నిర్లక్ష్యం చేస్తున్నారని మంగళవారం ఆందోళన చేశారు. అయితే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటన నేపథ్యంలో వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

దుబ్బాక: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. మంగళవారం డ్రైడే సందర్భంగా దుబ్బాకలోని 18వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్ రెడ్డితోకలిసి సిబ్బందితో ఇళ్లలోని నిల్వ నీటిని పారబోయించి, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజల బాధ్యత అన్నారు. కార్యక్రమంలో శానిటరీ పర్యవేక్షణ అధికారి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దుబ్బాక: సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. దుబ్బాక పట్టణంలోని 18వ వార్డుకు చెందిన మారోజు జగదీశ్వరీ అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం కోసం కుటుం సభ్యులు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. ప్రభుత్వం స్పందించి రూ.17 వేలు చెక్కు రూపంలో మంజూరు చేసింది. ఈ చెక్కును చైర్‌పర్సన్ జగదీశ్వరీ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ గణేశ్ రెడ్డి, తదితరులున్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన మంచె సుజాత అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.78,500 మంజూరయ్యాయి. ఈ చెక్కును జెడ్పీటీసీ కడతి రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారు కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చందసాగర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, స్వామి, రేకుల కుంట చైర్మన్ రమేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క రాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మాలోతు నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్, పీఈటీ పోస్టుకు..

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ఆదర్శ పాఠశాల/ కళాశాలలో 2023–24 సంవత్సరానికి గంటల ప్రాతిపదికన టీచర్ (ఆంగ్లం), పీఈటీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ప్రిన్సిపాల్ వసీ్నసా బేగం మంగళవారం తెలిపారు. ఏంఏ ఇంగ్లీష్, బీఈడీ పూర్తి చేసిన వారు ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తు పాఠశాలలో అందజేయాలన్నారు.

ఏఎంసీ ప్రమాణ స్వీకారం

బెజ్జంకి(సిదిదపేట): బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా కచ్చు చంద్రకళ, వైస్ చైర్మన్‌గా హన్మండ్ల లక్ష్మారెడ్డి నియమితులయ్యారు.

ఫ్లై ఓవర్ పైనుంచి పడి వాహనదారుడి మృతి



క్షతగాత్రుడిని తరలిస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్): నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్‌బ్రిడ్జి పైనుంచి వాహనదారుడు కిందపడటంతో తీవ్రం గాయపడ్డాడు. ఈ ఘటన కుకునూరుపల్లి శివారులో మంగళవారం జరిగింది. సిద్దిపేట కేసీఆర్ నగర్‌కు చెందిన మిరుదొడ్డి భూపతి బైక్‌పై గజ్వేల్ వెళ్తున్నాడు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఫ్లై ఓవర్‌పై వెళ్తుండగా నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జిపై నుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ పుష్పరాజ్ క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

400 లీటర్ల ఆయిల్ చోరీ

హవేళీఘనపూర్: మండల పరిధిలోని పోచమ్మరాల్, ఔరంగాబాద్ లెప్రసీ ఆస్పత్రి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రూ.45 వేల విలువ చేసే 400 లీటర్ల ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ వినోద్ కుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోచమ్మరాల్ సమీప పొలాలకు సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని రైతులు సమాచారం ఇచ్చారని ఏఈ తెలిపారు. అక్కడికి వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్లోని ఆయిల్ దొంగిలించినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

బైక్ చోరీ నిందితుడి అరెస్ట్

హుస్నాబాద్: పట్టణంలో మూడు రోజుల క్రితం బైక్‌ను చోరీ చేసిన నిందితుడిని పట్టుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన నిందితుడు ఏర్రోజు దేవేందర్ శుక్రవారం అర్ధరాత్రి హుస్నాబాద్ బస్టాండ్ సమీపంలోగల ఓ వీధిలో బైక్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. మంగళవారం పోలీస్‌లు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానస్పదంగా తిరుగుతున్న దేవేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. బైక్‌ను హుస్నాబాద్ సబ్‌స్టేషన్ సమీపంలో గడ్డివాములో దాచినట్లు తెలిపారు. వాహనాన్ని బైక్ యాజమానికి అప్పగించారు.

సంక్షిప్త వార్తలు

◆ పచ్చదనం వెల్లివిరియాలి

హుస్నాబాద్: ప్రతీ ఇల్లు మొక్కలతో పచ్చదనం వెల్లివిరియాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. హరితహారం 9వ విడత కార్యక్రమంలో భాగంగా 14, 17వ వార్డుల్లో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు భూక్య సరోజన, వల్లపు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కొండాపూర్ సర్పంచ్ జహంగీర్ అన్నారు. మంగళవారం గ్రామ నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పల్లెల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

◆ ఆయుర్వేద వైద్యశిబిరానికి స్పందన

సిద్దిపేటరూరల్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో పుల్లూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఉమాదేవి తెలిపారు. శిబిరంలో 89 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య కరదీపికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె నరేశ్‌గౌడ్, కార్యదర్శి రవికుమార్, ఫార్మసిస్ట్, ఏఎన్ఎం, ఆశాలు, పాల్గొన్నారు.

◆ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటుచేసినట్లు జూనియర్ లైన్‌మెన్ కుమార్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సబ్‌స్టేషన్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. దీనిస్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నాడు.

◆ స్వచ్ఛ సిద్దిపేట మన బాధ్యత

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేట మనందరి బాధ్యతని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. మంగళవారం 29 వార్డులో నడకతో చెత్త ఏరుదాం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులతో కలిసి వార్డులో పర్యటించారు. రోడ్డు పక్కన ఉన్న చెత్త, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో కమిషనర్ సంపత్, కౌన్సిలర్లు విఠోభ, మోహిజ్, వజీర్, నజీర్, శ్రీహరి, తిరుమల్ రెడ్డి, రాజేశం, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

◆ యోగాతో ఆరోగ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వ్యాసమహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, యోగా శిక్షకుడు తోట సతీష్, సంధ్య అన్నారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా సెంటర్‌లో ప్రతీరోజు సాయంత్రం 5 గంటల నుంచి 6వరకు, 6 నుంచి 7 గంటల వరకు రెండు విడుతలుగా యోగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

◆ పశువులకు వ్యాధి నివారణ టీకాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పశువుల్లో సీజనల్ వ్యాధుల నివారణకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి శ్వేత, సర్పంచ్ చంద్రశేఖర్ సూచించారు. మండల పరిధిలో ఇటిక్యాలలో మంగళవారం గాలికుంటు, లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పాడి రైతులంతా పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు ముందస్తు టీకాల వేయించాలన్నారు. పశువులకు సోకే ముద్ద చర్మవ్యాధి, గాలికుంటు వ్యాధులతో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందన్నారు.

◆ కేంద్రం వైఫల్యం

చేర్యాల(సిద్దిపేట): మణిపూర్ ఘటన కేంద్ర ప్రభుత్వ పుణ్యమేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా మైతాయి, కుకీ తెగల మధ్య అల్లర్లు జరుగుతున్నా వాటిని అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మణిపూర్ ఘటనపై చేర్యాలలో క్రైస్తవులు చేపట్టిన సంఘీభావ ర్యాలీకి పార్టీ తరుపున మద్దతు తెలుపుతున్నామన్నారు.

◆ లెర్నింగ్ లైసెన్సుల అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సౌజన్యంతో యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్నారు. మంగళవారం మండల పరిధిలో సుమారు 256 మందికి సిద్దిపేట ఆర్టీఓ కార్యాలయంలో లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల రోశయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శులు యాదగిరి, అమర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990